

కథా కౌముది

# గురుకృప

ఎం.హనుమంతరావు



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో
బహుమతి పొందిన కథ

ఇంటర్వ్యూలు జరుగుతున్న గదిలోకి వెళ్ళి కమిటీ సభ్యులకు ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చోగానే, జానకికి ఇంటర్వ్యూ ఫలితం తెలిసిపోయింది.

'కమిటీ అనుమతి కోరకుండా వాళ్ళముందు కుర్చీలో కూర్చోవడం 'మేనర్స్' కాదు' అన్నారు కమిటీ హెడ్ ఆచార్య పట్టాభిగారు కటువుగా. ఆ మాటలో కటుత్వం ఆయనకు తెలియకుండానే ఆయన మనోభావాన్ని బహిర్గతం చేసింది. కమిటీ సభ్యులుగా ఉన్న డీన్ ఆచార్య నారాయణ రావు గారికీ, కమిటీలో ప్రభుత్వ ప్రతినిధిగా ఉన్న శ్రీమతి సీతారత్నం గారికీ అప్పటి దాకా ముఖాల మీద ఉన్న చిరునవ్వులు మాయమయ్యాయి. గదిలో వాతావరణం గంభీరంగా, వేడిగా మారింది.

తను గదిలోకి రాగానే సీతారత్నం మేడమ్ కూర్చోమని సైగ చేస్తేనే జానకి కూర్చొన్నది. అప్పుడు పట్టాభి గారు పేపర్లలో తల దూర్చి ఉండడం వల్ల ఆ విషయం గమనించలేదు అని చెప్పడానికి సీతారత్నం మేడమ్ మొహమాట పడిపోయింది. తత్తరపడి పోయిన జానకి తనూ చెప్పలేక పోయింది.

ఆ యూనివర్సిటీలోనే సంస్కృతం విషయంగా ఎమ్మే చేసి, ఆ తరవాత అక్కడే నాలుగు సంవత్సరాలపాటు ఆచార్య బ్రహ్మయ్య గారి పర్యవేక్షణలో పరిశోధన చేసి, మూడు నెలల క్రితమే పీహెచ్డీ పట్టా అందుకొన్న జానకికి, పట్టాభిగారు అపరిచితుడు కాదు. బ్రహ్మయ్య గారు ప్రొఫెసర్ గా ఉన్నప్పుడు, పట్టాభి గారు అదే శాఖలో రీడర్ గా ఉండేవారు. జానకి ఎమ్మే చదువుతున్నప్పుడు, ఆమె తరగతికి నాటకాలూ,'ధ్వన్యాలోకం' పాఠాలు పట్టాభిగారే చెప్పారు.

రెండు నెలల క్రితం బ్రహ్మయ్య గారు పదవీ విరమణ చేయడంతో, ఆ స్థానంలో పట్టాభిగారు ప్రొఫెసర్ అయ్యారు. ఫలితంగా ఆ శాఖలో ఒక లెక్చరర్ ఉద్యోగానికి ఖాళీ ఏర్పడింది. ఆ ఖాళీ భర్తీ చేయడానికే ఈ ఇంటర్వ్యూ.

జానకికి తెలిసి పట్టాభిగారు ఒక సమర్థుడైన, అనుభవజ్ఞుడైన అధ్యాపకుడు. పండితుడు. సహోద్యోగులతో గానీ విద్యార్థులతో గానీ కలుపుగోలుగా ఉంటారు. ఒక విద్యార్థినిగా జానకిపట్ల ఆయనకు ప్రత్యేకంగా వాత్సల్యమూ లేదు, విముఖతా లేదు. పదిహేడు సంవత్సరాలు ఒకే శాఖలో తనతో పాటు తనకు సీనియర్ గా పని చేస్తూ వచ్చిన ఆచార్య బ్రహ్మయ్యగారితో మాత్రం ఆయనకు అంతగా సరిపడేది కాదని జానకితో సహా చాలా మందికి తెలుసు. నిజానికి వాళ్ళిద్దరూ కూడా పరస్పరం పల్లెత్తు మాట ఎప్పుడూ అనుకోలేదు కానీ వాళ్ళ స్వభావాలు వేరుగా ఉండేవి. బ్రహ్మయ్య గారు మితభాషి. అంతర్ముఖుడు. ఆయనకు సహోద్యోగులతో విద్యార్థులతో వ్యక్తిగత సంబంధాలంటూ ఉండేవే కాదు. ఆయన రోజులో ఎనిమిది గంటలు తన అనుష్ఠానాలకూ కుటుంబ వ్యవహారాలకూ, ఎనిమిది గంటలు ఉద్యోగవిధులకూ, ఎనిమిది గంటలు నిద్రకూ కేటాయించుకొనే వాడు. అందుకే ఆయనకు ఇతరులతో సంబంధాలకూ, స్నేహాలకూ, వైరాలకూ సమయమే ఉండేది కాదు. పట్టాభి గారికి యూనివర్సిటీ రాజకీయాలలో ప్రమేయం ఎక్కువ. పలుకుబడీ ఎక్కువే.

బ్రహ్మయ్యగారు పట్టాభి గారికి సీనియర్. శాఖాధిపతి. అయినా ఆయనకు పట్టాభి గారి మీద అధికార దర్పం ప్రదర్శించే అవకాశమూ ఉండేది కాదు, ఆసక్తీ ఉండేది కాదు. ఎవరి ఉద్యోగం వాళ్ళది. ఆయనతో పట్టాభిగారికి ఇబ్బంది ఒక్కటే. బ్రహ్మయ్య గారు రిటైర్ అయితే గానీ, పట్టాభి గారికి ఎంత పలుకుబడి ఉన్నా పదోన్నతి రాదు. బ్రహ్మయ్యగారు ఎంతకూ రిటైర్ కారు. పదవి ఖాళీ కాదు. బ్రహ్మయ్యగారు లేకపోతే తనకు కనీసం అయిదారేళ్లు ముందే పదోన్నతి వచ్చేదని, తనకున్న పలుకుబడితో ఉద్యోగ ప్రస్థానంలో మరింత ముందుకెళ్లే అవకాశం ఉండేదనీ పట్టాభి గారికి అప్పుడప్పుడూ అనిపిస్తూ ఉండేది, కానీ పట్టాభిగారి పదోన్నతి వాయిదా పడటంలో బ్రహ్మయ్యగారు కేవలం నిమిత్తమాత్రుడు.

ఉద్దండులైన పండితుల మధ్య సంబంధాలు భర్తృహరిగారి కాలం నుంచి అంతంత మాత్రంగానే ఉంటూ వస్తున్నాయి గదా! పట్టాభిగారిలాంటి వాళ్ళ స్పర్ధల సెగ బ్రహ్మయ్యగారిలాంటి నిమిత్తమాత్రుల మీద గూడా ప్రసరించడం మామూలే. ఈ విషయం జానకికి చూచాయగా తెలుసు. కానీ వాళ్ళిద్దరి మధ్య ఉన్న స్పర్ధ సెగ తన మీదకు వస్తుంది అని ఆమె ఏనాడూ ఊహించలేదు. పట్టాభిగారితో ఆమెకు మామూలు పరిచయం. రోజూ కలవక పోయినా, కలిసినప్పుడు పరస్పర గౌరవాలు ఎప్పుడూ కొరవడలేదు. ఎప్పుడూ చెప్పుకోదగ్గ పేచీలేవీ రాలేదు. వాస్తవానికి పట్టాభిగారు ఇంటర్వ్యూ కమిటీలో ఉండడం తనకు అనుకూలించే అంశం అనే జానకి భావిస్తూ వచ్చింది. తన అర్హతలు ఆయనకు బాగా తెలుసు. విద్యార్థినిగా, పరిశోధకురాలిగా తనను ఆయన బాగా ఎరిగిన వాడు. వ్యక్తిగత సాన్నిహిత్యమా? అది జానకికి బ్రహ్మయ్యగారితోనూ లేదు. పట్టాభిగారితోనూ లేదు.

అందుకే పట్టాభిగారి గద్దింపుకు జానకి నిర్ఘాంతపోయింది. చటుక్కున లేచి నిల్చొని, 'మే ఐ సిట్ డౌన్, సర్?' అని అనుమతి కోరింది.

'శాంస్క్రిట్ లెక్చరర్ పోస్టుకు ఇంటర్వ్యూకొచ్చి, ఇంగ్లీషు పాండిత్యం చూపిస్తే ఏం లాభం?' అన్నారు పట్టాభి గారు, ఇతర కమిటీ మెంబర్ల వైపు చూస్తూ. ఆ మాట అంటున్న వాళ్ళు కూడా ఆంగ్లభాష మీద అవసరాన్ని మించిన ప్రీతి ప్రదర్శిస్తున్నారని ఇతర కమిటీ మెంబర్లు గమనించినా, నిర్లిప్తంగానే ఉన్నారు. కూర్చోమని మాత్రం ఎవరూ అనలేదు. పట్టాభిగారి అకారణ ఆగ్రహానికి జానకి ముఖం వివర్ణమైంది. అలాగే నిల్చొని ఉండిపోయింది. పూర్తిగా రెండు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచాయి. 'ఏదయినా అడగండి' అన్నారు సీతారత్నంగారు, పట్టాభిగారి వైపు చూస్తూ.

'బ్రహ్మయ్య గారి జమానాలో ఆయన ప్రియశిష్యురాలిగా నాలుగేళ్ల పాటు ఈ డిపార్ట్మెంట్ ని ఏలిన దానివి, నిన్ను నేను ప్రశ్నలు అడిగేటంత వాడినా? నువ్వే చెప్పుకో నీ స్పెషల్ క్వాలిఫికేషన్లన్నీ, కమిటీ మెంబర్లు విని ఆనందిస్తారు' అన్నారు పట్టాభిగారు, చేతిలో పెన్సిల్ తో ఇతర కమిటీ మెంబర్లను చూపుతూ. ఆయన మాట ధోరణికి జానకికి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

కొంచెం సంబాళించుకొని, 'నేను స్కూల్లో చదువుకొనేరోజుల్లో, మా జిల్లాలో ప్రముఖ సంస్కృత పండితులు శ్రీ కృష్ణప్ప గారి దగ్గర అయిదేళ్లు సంస్కృతం ప్రత్యేకంగా నేర్చుకొన్నాను. సంస్కృతం ముఖ్య విషయంగా ఆరేళ్ళ క్రితం ఇదే విశ్వవిద్యాలయం నుండి ప్రథమ శ్రేణిలో, ప్రథమ స్థానంతో బియ్యే పట్టా పొందాను. ఈ విశ్వ విద్యాలయం లోనే, ఆచార్య బ్రహ్మయ్య గారు, ఆచార్య పట్టాభి గారి లాంటి దిగ్గజాల శిక్షణలో ఎమ్మే చదివాను. ఎమ్మేలో కూడా సర్వ ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించి, స్వర్ణపతకం సంపాదించుకోగలిగాను.....'

'మధ్యలో నా పేరెందుకెత్తుతావు? ఇంటర్వ్యూ కమిటీలో ఉన్నాననా? ఇలాంటి పొగడ్తలు డిపార్ట్మెంట్లో ఇదివరకు పనిజేసేవేమో గానీ, ఇప్పుడు చెయ్యవు. ముక్కు సూటిగా వెళ్ళే నాలాంటి వాళ్ళను ఈ ముఖ స్తుతులతో ప్రభావితం చెయ్యాలనుకోకు' అంటూ అడ్డు తగిలారు పట్టాభి గారు. కష్టం మీద తనను తను నిగ్రహించుకొని జవాబు కొనసాగించింది జానకి.

'... ఆ తరవాత ఆచార్య బ్రహ్మయ్య గారి పర్యవేక్షణలో 'భాస నాటకాలలో ఆలంకారిక విశేషా'ల గురించి పరిశోధన చేసి డాక్టరేట్ అందుకొన్నాను. పన్నెండు పరిశోధన వ్యాసాలను ప్రముఖ సంస్కృత పరిశోధన పత్రికలలో వెలువరించాను. నేను సంస్కృతంలో తడుముకోకుండా ధారాళంగా మాట్లాడగలను. నేను పరిశోధకురాలిగా ఉన్న కాలంలో, మూడేళ్లు శాఖాధ్యక్షులు ఆచార్య బ్రహ్మయ్యగారి ఆదేశంతో ఎమ్మే విద్యార్థులకు సంస్కృత వ్యాకరణం పాఠాలు నేనే చెప్పాను...'

'బ్రహ్మయ్యగారికి క్లాసులు తీసుకోవడానికి బద్ధకం. ఆయన తన క్లాసులు సగం తన రిసర్చ్ స్కాలర్లకు అప్పజెప్పేసే వాడు. పైగా వ్యాకరణం చెప్పడమంటే ఆయనకు ఎప్పుడూ పిరికితనమే. చాలా రోజులు ఆ క్లాసులు నాకు

తగిలించే వాడు. నాకు విసుగెత్తిపోయి, నేను వెళ్ళననేసరికి మెల్లిగా అవి నీకు తగిలించాడు. నువ్వు లేకపోతే మరొకళ్ళకిచ్చే వాడు. ఆ మాత్రానికే అంత ఆత్మస్తుతి అవసరం లేదు' మళ్ళీ అడ్డొచ్చారు పట్టాభి గారు.

అడిగిన ప్రశ్నకు జవాబు చెప్తే అది ఆత్మ స్తుతి ఎలాగవుతుందో జానకికి అర్థం కాలేదు. జానకికి మనస్సు చివుక్కుమన్నా, గురుస్థానంలో ఉండిఉన్న వాళ్ళతోనూ, పెద్దలతోనూ, తగవు పెట్టుకోవడానికి ఆమె మధ్యతరగతి మనస్తత్వం, వ్యక్తిగత సంస్కారం అడ్డు వచ్చాయి. అయినా, పట్టాభి గారు అలా తన ప్రతి మాటకీ అడ్డుతగిలి పెడర్థం చెప్తుంటే ఎలా ముందుకెళ్లాలో ఆమెకు తోచలేదు.

'...నా అర్హతలకు సంబంధించిన వివరాలన్నీ నా అప్లికేషన్ తో పాటు అందజేశాను...' అని ముగించ బోయింది.

'...కనక నా అర్హతలను గురించి నన్ను ప్రశ్నించద్దు అనా నీ ఉద్దేశ్యం? అప్లికేషన్ లో చేటభారతం లాగా నీ ఆటోబయోగ్రఫీ అంతా రాశావు, ఆ భారతమంతా చదవలేదు గానీ చూశాను. అయినా ఆత్మస్తుతి తప్ప అందులో మాత్రం ఏముంది?' అన్నారు పట్టాభిగారు, ఇతర కమిటీ మెంబర్లను చూస్తూ. ఇతర కమిటీ మెంబర్లు టైమ్ లేక దాన్ని చూడనుగూడా లేదు, కనక అందులో ఏముందో వాళ్ళకూ తెలియదు. అందుచేత పట్టాభిగారే మళ్ళీ కలగజేసుకొన్నారు. 'చూడు జానకీ, నేను ఏ మాటైనా ముఖానే చెప్పేస్తానని నీకు తెలిసే వింటుంది. 'విద్యా దదాతి వినయం' అన్నారు. ఆ వినయమే లేనపుడు ఇక ఏవి ఉండి ఏం లాభం? అవినయం, ఆత్మ స్తుతీ మంచి ఉపాధ్యాయుల లక్షణాలు కావు!' అన్నారు.

'నేనేం అవినయం చూపాను, సర్?' అంది జానకి ఆశ్చర్యంగా.

'అదుగో మళ్ళీ! ఈ ఇంటర్వ్యూ మమ్మల్ని నువ్వు ప్రశ్నించడానికి కాదు, మేము నిన్ను ప్రశ్నించడానికి. ఆత్మ విమర్శ చేసుకొంటే నీ అవినయమేమిటో నీకే తెలుస్తుంది' అన్నారు పట్టాభిగారు.

జానకి అవాక్కయ్యింది. ఇతర కమిటీ మెంబర్ల వైపు చూసింది. సీతారత్నంగారు తల పక్కకు తిప్పి దూరంగా గోడ మీద ఉన్న బల్లి మీద దృష్టి పెట్టారు. డీన్ గారు తన ముందున్న కాగితాలు తీక్ష్ణంగా పరిశీలిస్తున్నట్టు నటించారు. తరవాతి అభ్యర్థి కోసం పట్టాభిగారు గంట కొట్టడంతో, కూర్చొనే అవసరం లేకుండానే జానకి ఇంటర్వ్యూ ముగిసింది.. జానకి ధన్యవాదాలు చెప్పి బయటకు నడిచింది.

తరవాతి అభ్యర్థి గిరిజ. ఆమె లోపలికి వస్తూనే, 'శ్రీ గురుభ్యో నమః' అంటూ పట్టాభి గారి పాదాలు తాకి నమస్కరించింది. ఆయన పాదధూళి తలమీద వేసుకొంది. తరవాత మిగతా కమిటీ మెంబర్లకు కూడా పాదాభివందనం చేసింది.

పుత్రికా వాత్సల్యంతో ఆమె వైపు చూస్తూ, 'కూర్చో తల్లీ!' అన్నారు పట్టాభి గారు నవ్వుతూ. ఇతర సభ్యుల ముఖాల మీదికి కూడా చిరునవ్వు తిరిగివచ్చింది.

'ఫరవాలేదు, సర్! ప్రొఫెసర్స్ ముందూ, ఇంకా, పెద్దల ముందూ ఇలా నిలుచొని మాట్లాడితేనే నాకు ఆనందంగా ఉంటుంది' అన్నది గిరిజ. తల పంకిస్తూ ప్రభుత్వ ప్రతినిధి వైపు చూశారు పట్టాభి గారు.

'ఎమ్మేలో నీకు మంచి మార్కులు వచ్చినట్టు లేదు, కారణం?' అని అడిగింది సీతారత్నంగారు.

'గురువు గారి పెర్మిషన్ తో నా మనసులో మాటలు ఫ్రాంక్ గా చెప్తాను. తప్పులుంటే పెద్దలు మీరందరూ పెద్దమనసుతో క్షమించాలి' అంది గిరిజ చేతులు జోడించి. చెప్పమన్నారు పట్టాభి గారు.

'నేను డిగ్రీ వరకు సైన్సు సబ్జెక్టులు చదివాను ఇంగ్లిష్ మీడియంలో. మాత్స్, ఫిజిక్స్ ఇంకా కెమిస్ట్రీ చదివాను. ఇంకా, కెమిస్ట్రీ నా అభిమాన విషయం. కానీ మాది మిడిల్ క్లాస్ ఫ్యామిలి అన్న మాట. మా ఇంటిపేరు మాచిరాజు. మిడిల్ క్లాస్ ఫామిలీస్ అన్న తరవాత అమ్మాయిలకు చాలా ప్రాబ్లమ్స్ ఉంటాయి కదా? ఎగ్జాక్ట్ గా నా డిగ్రీ పరీక్షలకు రెండు నెలలముందు మా అక్క మేరేజ్ జరిగింది. ఇంకా, ఇంట్లో అంత పెద్ద శుభకార్యం పెట్టుకొని, నేను స్టడీస్ మీద ఫోకస్ చేయలేదు. ఆడ పిల్లలం గదా! మాది లార్జ్ ఫామిలీ. పెళ్లి పనులన్నీ నేనే చేయాల్సి వచ్చింది. ఇంకా, నాకు డిగ్రీ ఎగ్జామ్స్ లో మంచి మార్కులు రాలేదు.

కానీ నాకు చిన్నప్పటినుంచి పెద్ద చదువులు చదవాలని ఒక 'డ్రీమ్' అన్న మాట. ఇంకా, ముఖ్యంగా మా అమ్మమ్మకి ఆడ పిల్లలని పెద్ద చదువులు చదివించాలని ఒక తపన ఉండేదన్నమాట. ఆ సమయంలో దైవం మానుషం అన్నట్టు మాకు ప్రొఫెసర్ పట్టాభిగారు – పూజ్యులు ప్రొఫెసర్ పట్టాభిగారు– కనిపించారు. నన్ను ఎంతగానో ప్రోత్సహించి నా చేయి పట్టి నడిపించి ఎమ్మే (సంస్కృతం) డిగ్రీ చేయించారు. ఆయనకూ మాకూ ఎలాంటి బాంధవ్యమూ లేకపోయినా, కేవలం ఒక ఉత్తమ గురువుగా ఆయన నా మీద వాత్సల్యం చూపించారు. ఆయన కలిసిన రోజు నుంచి ఆయనే నాకు తల్లీ తండ్రీ దైవమూ అయ్యారు. ఇంకా, నేను ఆయన కూతురుతో సమానంగా ఆయన కుటుంబ సభ్యురాలినయిపోయాను. అమ్మగారు, అంటే ప్రొఫెసర్ పట్టాభి– పూజ్యులు ప్రొఫెసర్ పట్టాభి గారి– ధర్మపత్ని... ఆమెను నేను 'అమ్మ గారూ' అనే పిలుస్తాను .... ఇంకా, ఆమె కూడా నన్ను కూతురుగానే చూసుకొనే వారు. నేను పీజీ చేయగలిగానంటే – అందునా నాకు దాదాపు ఏ మాత్రం తెలియని సంస్కృతం లో పీజీ చేయగలిగానంటే – దానికి కేవలం మా గురువు గారు పూజ్యులు ప్రొఫెసర్ పట్టాభి గారి చలవే కారణం అన్న మాట...

ఇంకా...పూజ్యులు ప్రొఫెసర్ పట్టాభిగారు పుత్రికా వాత్సల్యంతో నాకు ఎన్నెన్నో స్పెషల్ క్లాసులు తీసుకొన్నారు. ఆయితే నేను ఎమ్మే ఫైనల్ ఇయర్ లో ఉండగానే మా అన్నయ్య పెళ్లి జరిగిందన్న మాట . అందువల్ల ఇంకా నేను మంచి మార్కులు తెచ్చుకోలేకపోయాను. ఇంకా, ఆ సంవత్సరం దాదాపు పరీక్షల ముందే పూజ్యులు ప్రొఫెసర్ పట్టాభి గారి అమ్మాయి అమెరికా నుండి వచ్చింది. ఇంకా శిరీషక్కతో పాటు షాపింగ్ పనులూ , ఇతరపనులూ... ఇంకా ఇంట్లో పనులూ.. ఉండడం వల్ల చదువుకొనేందుకు టైమ్ సరిపోలేదు. అయినా, 'గురు శుశ్రూష ముఖ్యమూ, అది ఉంటే మిగిలినవన్నీ ఎప్పుడయినా సాధించచ్చు' అని మా అమ్మ మాకు ఉగ్గుపాలతో నేర్పిందన్న మాట.....'

'పోనీలే ఏమయింది. పీహెచ్డీ కూడా అందుకొన్నావు గదా!' అన్నారు డీన్ నారాయణ రావు గారు. ఇతర పని వత్తిళ్ల వల్ల కొంతా, ఈ 'ఇంకా'లూ, 'అన్నమాట'లూ కొంచెం శ్రుతి మించి విసుగెత్తిస్తుండడం వల్ల కొంతా ఆయన ఈ ఇంటర్వ్యూల తంతుకు త్వరగా మంగళం పాడించే ఊపులో ఉన్నారు. అసలే ఈ కమిటీ పని ఆయనకు బలవంతపు బ్రాహ్మణార్థం. ఆయన జంతుశాస్త్ర ఆచార్యుడు. ఆయనకు సంస్కృతం శాఖ విషయాల్లో ఏ ఆసక్తీ లేదు.

'అది కూడా మా ప్రొఫెసర్ – పూజ్యులు ప్రొఫెసర్ పట్టాభి– గారి అనుగ్రహమే, సర్! ఇంకా, చెప్తే ఎవరూ నమ్మరు గానీ నా థీసిస్ లో సగం పైగా ప్రొఫెసర్ పట్టాభి–పూజ్యులు ప్రొఫెసర్ పట్టాభి – తయారు చేసి పెట్టారు. నా పీహెచ్డీ కోసం నాకంటే ఆయనే ఎక్కువ శ్రమ పడ్డారు. ఆయన లేకపోతే నేను 'వైవా' లో గట్టెక్క గలిగే దాన్ని కాదు.' ప్రొఫెసర్ గారి ప్రస్తావన వచ్చినప్పుడల్లా గిరిజకు గురుభక్తి పారవశ్యంతో రెండు చేతులూ ఆమె ప్రయత్నం లేకుండానే అంజలి ముద్ర పడతాయి.

'డాక్టర్ గిరిజను నేను ఈ ఇంటర్వ్యూలో అడగాల్సిన ప్రశ్నలేమీ లేవు. నాలుగేళ్ళు నా దగ్గర మంచి కమిట్మెంట్ తో, డిసిప్లిన్ తో, డెడికేషన్ తో రీసర్చ్ చేసి , పీహెచ్డీ పొందిన అన్ని అర్హతలూ ఉన్న ఒక బ్రిలియంట్ విద్యార్థిని గురించి నేనేమైనా చెప్పినా బాగుండదు. నన్ను పొగుడుకొన్నట్టే అవుతుంది. మీరే ఏమయినా అడిగితే అడగండి' అన్నారు పట్టాభి గారు.

వెంటనే 'మంచిదమ్మా, ఆల్ ది బెస్ట్!' అంటూ డీన్ గారు టైమ్ చూసుకొంటూ తరవాతి అభ్యర్థి కోసం గంట కొట్టారు. తన ఇంటర్వ్యూ ముగిసింది గనక, గిరిజ మళ్ళీ ప్రొఫెసర్ గారికి పాదాభివందనం చేసి వెళ్లింది.

'చూశారా ఆమె సంస్కారం?' అన్నారు ప్రొఫెసర్ పట్టాభి ఇతర కమిటీ సభ్యులతో.

డీన్ గారికి ఆ రోజు చేయాల్సిన ఇంటర్వ్యూలు ఇంకా చాలా ఉన్నాయి. అవన్నీ పూర్తి చేసి మధ్యాహ్నం నాలుగున్నర ట్రైన్ పట్టుకొని చెన్నై వెళ్ళాలన్న తొందరలో ఉండి ఆయన ఆ సంస్కారాన్ని అంతగా గమనించినట్టు లేదు. కానీ, పై అధికారులతో రోజూ ఇలాంటి మీటింగులెన్నింటి లోనో పాల్గొంటూ ఉండే సీతారత్నం గారికి మాత్రం అది కొట్టొచ్చినట్టు కనిపించింది. 'అవును, ప్రొఫెసర్ గారూ, ఈ అమ్మాయి జీవితంలో ఎంతో పైకి వస్తుంది' అన్నారు.

ఇది జరిగిన ముప్పయ్యయిదేళ్ల తరవాత, ప్రొఫెసర్ గిరిజ – ఆమె ముఖ్య శిష్యులు ఆమెను పూజ్య ప్రొఫెసర్ గిరిజ అంటారు – అదే విశ్వ విద్యాలయంలో వైస్ చాన్సిలర్ గా పదవీ విరమణ చేసింది. పదవీ విరమణ సందర్భంగా భారీ ఎత్తున అభినందన సమావేశం జరిగింది. ఆ సభలో ప్రొఫెసర్ గిరిజ– పూజ్య ప్రొఫెసర్ గిరిజ– ఉధృతమైన భావోద్వేగంతో ప్రసంగించింది.

'...ఇంకా.. గురుకృపతో ఏదయినా సాధించచ్చు అనే మాటకు నేనే మంచి ఉదాహరణ. నేనేక్కిన పదవీ సోపాన పరంపరే దానికి నిదర్శనం. నా అర్హత, అధ్యయనమూ, మేధా శక్తీ సాధారణమైనవే అయినా, మా గురువుగారు పూజ్యులు

ప్రొఫెసర్ పట్టాభి గారి వాత్సల్యం వల్ల, కృషి వల్ల, ఇంకా, కటాక్షం వల్ల నేను ఇన్ని ఎత్తులు ఎక్కగలిగాను. నన్ను లెక్చరర్ చేసింది వారి కృప. తరవాత రీడర్, ప్రొఫెసర్ కావడంలో గూడా వారి అదృశ్య హస్తం ఉంది.

..మా గురువుగారికి అన్ని వర్గాలలోనూ చాలా పలుకుబడి ఉండేది. ఆయన సంస్కృత భాషాభివృద్ధి విషయంలో ఈ దేశంలో నియమించిన కమిటీలన్నిటిలోనూ సభ్యులుగా ఉండేవారు. ఆ తరవాత ఆ కమిటీలన్నిటిలోనూ నాకు స్థానం లభించింది. నేను గూడా పూజ్యులు ప్రొఫెసర్ పట్టాభి నడిచిన బాటలో నడిచాను. ఇంకా, నా దగ్గర పీహెచ్డీ చేసిన ఏడుగురు విద్యార్థులకూ నేనే మంచి మంచి ఉద్యోగాలు ఇప్పించి జీవితంలో నిలదొక్కుకొనేలా చేశాను. రాజకీయ కారణాల వల్ల పూజ్యులు పట్టాభి గారిని వరించని వీసీ పదవి కూడా నాకు దక్కిందంటే అది కేవలం ఆయన ఆశీర్వాద బలమే.

...సంస్కృత భాషలో శిక్షణ విధానాలూ, సిలబసులూ, కొత్త కొత్త కోర్సులూ, సంస్కృత అధ్యాపకుల నియామక నియమావళులూ ఇత్యాదులు రూపొందించిన జాతీయ స్థాయి కమిటీలన్నిటిలోనూ నేను పని చేశానంటే, అందుకు కారణం గురు కృప.... నా తరవాత తరాల విద్యార్థినీ విద్యార్థులకు నా సందేశం కూడా ఇదే. గురువు అనుగ్రహం అన్నిటికంటే ముఖ్యం. అది ఉంటే అన్నీ సాధించవచ్చు. గురు శుశ్రూష ఎంత ఎక్కువ చేస్తే అంత వృద్ధిలోకి వస్తారు అన్న మన ప్రాచీనుల సందేశం ఏ నాటికీ వర్తించేదే.......' అంటూ తన ప్రసంగంలో ఎన్నో విలువైన విశేషాలు ప్రస్తావించారు పూజ్య ప్రొఫెసర్ గిరిజ.

సరిగా అదే రోజున, దాదాపు అదే సమయంలోనేమో గూడా, భూగోళానికి రెండో వైపున, అమెరికాలో డా. జానకి పాండే తనకు జరిగిన అభినందన సభలో ప్రసంగించింది. ఆ వారమే ఆమె అక్కడ, ఏషియన్ కల్చర్ అండ్ లాంగ్వేజెస్ విభాగంలో మ్యాక్స్ ముల్లర్ ప్రొఫెసర్ గా అయిదు సంవత్సరాల కాల పరిమితి గల ప్రతిష్ఠాత్మకమైన పదవిలో చేరింది.

ముప్ఫయ్యయిదేళ్ల క్రితం డా. జానకికి ఎంత ప్రయత్నించినా ప్రొఫెసర్ పట్టాభిగారి పుణ్యమా అని తన యూనివర్సిటీలోనే కాదు, తన రాష్ట్రంలో మరే యూనివర్సిటీ లోనూ ఉద్యోగం దొరకలేదు. ఆమె చాలా నిరుత్సాహ పడిపోయింది. ఆర్థిక కారణాలవల్ల పొట్టపోసుకొనే ఉద్యోగం కోసం ఆమె బహుదూరం ప్రయాణించి కాశీ హిందూ విశ్వ విద్యాలయంలో సంస్కృత విద్యా ధర్మ విజ్ఞాన శాఖలో ఉపన్యాసకురాలిగా చేరింది. అక్కడ ఉండగానే ఆమె, ఆ శాఖలోనే తన సహోద్యోగిగా ఉన్న మయూర్ పాండేను పెళ్లి చేసుకొన్నది.

దంపతులిద్దరూ సంస్కృత భాషలో మరింత కృషి చేసి, కాలక్రమంలో గొప్ప సంస్కృత విద్వాంసులుగా అంతర్జాతీయ ఖ్యాతి సంపాదించారు. సంస్కృత వ్యాకరణం మీద డాక్టర్ జానకి ఇంగ్లీషులో రాసిన ప్రామాణిక మైన వివరణ గ్రంథం నలభయ్యారు ముద్రణలు పొందింది. ఇప్పుడు సంస్కృత వ్యాకరణంలో జానకిని మించిన పండితులు ప్రపంచంలో ఎక్కడా లేరు అని పేరు. అలాగే భారతీయ దర్శనాలలో డాక్టర్ మయూర్ పాండే పాండిత్యం ప్రపంచ ప్రసిద్ధి పొందింది. ఆ దంపతులు కాశీలో పదేళ్లూ, తరవాత ఢిల్లీ జేయెన్యూ లో రెండేళ్లూ, జర్మనీలో లీప్జిగ్ విశ్వవిద్యాలయంలో

పదేళ్ళూ ప్రొఫెసర్లు గా ఉన్నారు. దాదాపు మరో దశాబ్దం ఇంగ్లండ్లో ఆక్స్ఫర్డ్ సెంటర్ ఫర్ హిందూ స్టడీస్ లో పని చేసిన తరవాత ఇద్దరికీ కాలిఫోర్నియా విశ్వ విద్యాలయం వారి ఆహ్వానం వచ్చింది. ఇద్దరూ అతి విశిష్టమైన పదవులలో అక్కడ చేరారు.

అక్కడి భారతీయ విద్యార్థులు ఆ దంపతులకు ఏర్పాటు చేసిన అభినందన సభలో జానకి ప్రసంగించింది. సభ చివరిలో పదిహేను నిమిషాలు సభికుల ప్రశ్నలకు కేటాయించారు.

'మీ రంగంలో మీరు యిన్ని సాఫల్యాలు సాధించి, యింత ప్రఖ్యాతి పొందడం వెనక రహస్యం ఏమిటి?' అని అడిగింది ఒక విద్యార్థిని.

'నేను ఎంతో సాధించానని నేను అనుకోవడం లేదు. అనుకొన్నవీ, అనుకోనివీ ఎన్నో అంశాలూ, అవకాశాలూ, ఘటనలూ, ఎందరో చేసిన ఎన్నో ఉపకారాలూ, అపకారాలూ, మనిషి పురోగతికి సహాయపడతాయి. నా తల్లి దండ్రులూ, నా భర్తా, నా విద్యా గురువులూ, నా సహోద్యోగులూ, సహాధ్యాయులూ, నా శిష్యులూ, నా ఇద్దరు పిల్లలూ– వీళ్ళందరి సహకారం నాకు పుష్కలంగా లభించింది, ఇన్ని అంశాలు కలిసిరావడాన్ని ఒక్క మాటలో చెప్పాలంటే, దైవానుగ్రహం అంటాను. నా జీవితాన్ని అదే నడిపించింది. నడిపిస్తున్నది' అన్నది జానకి.

దీని తరవాత మరో నాలుగయిదు ప్రశ్నలు వచ్చాయి. చివరిగా ఒక విద్యార్థిని లేచి 'డా. జానకీ, మీ జీవితంలో ఏదయినా కీలక సమయంలో మీకు మహోపకారం చేసి, గురుకృపతో, మీ జీవితాన్ని మలుపు తిప్పిన గురువులెవరయినా ఉన్నారా?' అంది.

ఒక అర నిమిషం ఆలోచించి జానకి నిదానంగా జవాబిచ్చింది: 'నా దృష్టిలో 'గురువు' అనేది పెద్ద మాట. సర్వ సమ బుద్ధి కలిగి, రాగద్వేషాలకు అతీతంగా ఉండే ఆత్మ జ్ఞాని అయిన ఆధ్యాత్మిక గురువును గురువనాలి. నాలాగా ఉపాధ్యాయ వృత్తిని ఉపాధిగా స్వీకరించి, లౌకిక విషయాలు నేర్పే వారిని అధ్యాపకులనీ, ఉపాధ్యాయులనీ, బోధకులనీ, శిక్షకులనీ, ఇంకా కావాలంటే ఆచార్యులనీ, మార్గ దర్శకులనీ అనడం బావుంటుంది. జీవితం వివిధ దశలలో నాకు ఎందరో గొప్ప గొప్ప అధ్యాపకుల సాంగత్యం లభించింది. వాళ్ళను పేరు పేరునా చెప్పడం కష్టం.

ఇప్పుడు మీరడిగితే నాకు నా జీవితంలో ఒక విశేషం స్ఫురిస్తున్నది, ఒకానొక ఆచార్యుడు చూపిన 'గురు కృప', చేసిన మహోపకారం నా జీవితాన్ని నిజంగానే మలుపు తిప్పాయి. అయితే ఆయన ఆ మహోపకారం చేసింది నాకు కాదు, తన మరో శిష్యురాలికి. ఆయన ఆమె పట్ల చూపిన 'గురుకృప' ఫలితంగా, నేను ఉన్న ఊరు విడిచి వారణాసి చేరవలసి వచ్చింది. దాంతో నా జీవన ప్రస్థానం దిశ అనుకోని విధంగా మారిపోయింది....'

★★★★★★

COMMENTS